ఓ౩మ్

యజ్ఞాలోక్ - 3

అర్థ - శౌచము
(ఆర్థిక పవిత్రత)



హిందీ మూలము

ప్రో. ఉమాకాంత్ ఉపాధ్యాయ్, ఎం, ఏ

తెలుగు సేత

లోక్ లక్ష్మీనారాయణ

ఆర్ష గురుకులము, వడ్లూరు. కామారెడ్డి

ప్రచురణ

యజ్ఞాలోక్

(వైదిక ప్రతిష్ఠానము)

ప్లాటునం. 73 ప్రసాంత్ నగర్, మలక్ పేట

హైదారాబాదు—500036

ప్రత్యేక కానుక

ప్రమోదూత శ్రావణి 1990

ఓ౩మ్

నివేదనము

అంతఃకరణ ప్రేరణా ఫలితముగ రూపొందినదే యీ వ్యాసము నాకు బుద్ధిమంతులు, సదాచారులు, సంపన్నులు నైన శిష్యులును యజమానులును గలరు. ఇది నా భాగ్యము. వారి యెడ వారి రిపవారము నెడ గల స్నేహమును పురస్కరించుకొనియే యీ పంక్తులు వ్రాసినాను. "సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ " అను న్యాయమును. ఉల్లంఘించుట అప్పుడప్పుడు, విశేషించి శిష్యుల విషయమున క్షమార్హమే యని నా భావము.

రచయిత

ఓమ్

అర్థ - శౌచము

యోగమునకు గల "యమనియమాస"నాది అష్టాంగములలో "నియమము" రెండవది. "శౌచ సంతోషతపః స్వాధ్యా"యాది నియమములలో "శౌచము"నకు ప్రథమ స్థానము గలదు.

అద్భిర్గాత్రాణి శుద్ధ్యన్తి మనః సత్యేన శుద్ధ్యతి ।
విద్యాతపోభ్యాం భూతాత్మా బుద్ధిర్జ్ఞానేన శుద్ధ్యతి ॥ మను.

మనుస్మృతిలోని యీ శ్లోకమునకు స్వామీ దయానందులు దిగువ అర్థమును వ్రాసినారు—

"జలముచే బాహ్య అంగములు పవిత్రములగును, కాని ఆత్మ మరియు మనస్సుకాజాలవు. సత్యమునే అంగీకరించుట, సత్యమునే పలుకుట మరియు సత్యమునే ఆచరించుట వలన మనస్సు పవిత్రమగును. విద్య, యోగాభ్యాసము మరియు ధర్మాచరణము వలననే జీవాత్మ పవిత్రమగును. జ్ఞానము వలననే బుద్ధి నిర్మలమగును., జలము, మట్టి మున్నగువానిచే కాదు".

జలము, మట్టి, సబ్బు మున్నగువానిద్వారా కలిగిన శుచికన్న అర్థశౌచము - అర్థపవిత్రత అధిక మహత్త్వపూర్ణమైనది. ఈ విషయమున సంస్కారవిధిలో గృహాశ్రమప్రకరణమున మహర్షి దయానందులు మనుస్మృతిలోని దిగువ శ్లోకమున కొసగిన అర్థము గమనింపదగినది—

సర్వేషామేవ శౌచానామర్థశౌచం పరం స్మృతమ్ ।
యోఽర్థే శుచిర్హి స శుచిర్న మృద్వారి శుచిః శుచిః ॥ మను.

"ధర్మముతో పదార్థములను సమకూర్చుకొనువాడే ఉత్తమోత్తమమైన పవిత్రత గలవాడగును. అనగా అన్యాయము అధర్మముతో ఏపని

పదార్థమును గూడ గ్రహింపకుండుటయే పవిత్రత, జలమృత్తి కాదులచేనగు పవిత్రత ధర్మముచే ఐనదాని వలె ఉత్తమమైనది కాదు.

జలము, మట్టి మున్నగువానిచే జరుగు శుద్ధికి బాహ్యాఅవయవములతో సంబంధము గలదు, కాని అర్థ-శౌచమునకు ధర్మముతోను, ఆచరణతోను సంబంధము గలదు. ధర్మ శుద్ధి లేకున్న బాహ్యశుద్ధి వ్యర్థమగుటయే గాక భ్రమ కారకము అగును. బాహ్యము నునుపు, ఆకర్షణీయము. కాని అంతరము పాప పంకిలమయము- ఇట్టి వారిని గూర్చియే దిగువ భావము ప్రకటింపబడినది

మనసు మలినమైన తను వంద మెట్లు?
విషరస పూర్ణ కనక ఘటము నట్లు!

కనక ఘటము (బంగరు పాత్ర) నిందనీయము కాదు- అది విషముచే నిండియున్నప్పుడే నిందనీయము, త్యజింపదగినది అగుచున్నది. దాని బాహ్య సౌందర్యము మన కళ్లను తనవైపు ఆకర్షించుకొనును దాని బాహ్య మెఱుగులను జూచి మోహితుడైన వ్యక్తి వినాశము పాలగుట నిశ్చయము

బాహ్య సౌందర్యము, బాహ్య పవిత్రత, శరీరము మరియు వస్త్రముల శుభ్రత, జలము, మట్టి, సబ్బు మున్నగువాని వలన సమకూరు శుభ్రత ఇవన్నియు చాలమంచివే, పాటింప దగినవే. బాహ్య శుభ్రత పాటించ వలసినదే. ఇందు భిన్నాభిప్రాయమేకాని దీనికి వికల్పమేగాని లేదు. బాహ్య శౌచము అనివార్యమే. అంతమాత్రము సరిపోదు బాహ్య పవిత్రతతో

బాటు ఆంతరిక పవిత్రతయు అనివార్యమే.

మనలోపలి అపవిత్రతకు దుష్టమైన మన మనోవికారములే కారణము కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సర, ఈర్ష్యా ద్వేషాదులే దుష్టమనోవికారములు. వీనివలననే మనుష్యుడు కర్తవ్యములు కానట్టి కర్మలు చేయును.

ఇవే మానవజీవిత కల్యాణ మార్గమునకు శత్రువులై అతని పతనమునకు కారణము లగుచున్నవి

స్వామి శంకరాచార్యు లెంత చక్కగా నుడివిరో గమనింపుడు
"కే శత్రవః సంతి? నిజేంద్రియాణి।
తాన్యేవ మిత్రాణి జితాని యాని॥"

మనయింద్రియములే మనకు శత్రువులు. కాని వానిని వశమందుంచు కొన్నచో అవియే మనకు మిత్రములగును.

కాని మనుష్యుడు విషయములకు బానిసయై తన,అమూల్య జీవితమును నష్టమొనర్చుకొనుచున్నాడు. విషయములు బంధనములే గదా! "విశేషేణ సినంతి బంధంతి - విషయాః"

విషయాచారి, ఇంద్రియాచారియైన వ్యక్తి భౌతిక ఆకర్షణలలో బంధింప బడును. అతని చూపునుండి సత్యము దూరమైపోవును. అతడు సదాచారమును వదలి పై మెఱుగులవెంట పరుగిడుచుండును. ఇట్టి వ్యక్తి అర్థశౌచమహత్త్వ మును గూర్చి యోచించుటకైనను ఇష్టపడడు

ధనసంపాదనము ఉత్తమమైన కర్మయే - "వయంస్యామపతయో రయీణామ్" (మేము ఐశ్వర్యములకు అధిపతులము అగుదుముగాక!) అని వేదము ప్రేరేపించుచున్నది ధనసంపాదన మంచిదేయైనను చెడుమార్గము ననా? మంచిపనికి చెడుమార్గమా? ఇది మిక్కిలి హీనమైన వృత్తి. ఆత్మ పతనమున కిది సూటి మార్గము. మంచి పనులకైనను చెడు మార్గము నవలంబించగూడదు. మార్గము చెడుదైనచో కార్యము మంచిదైనచో కార్యము మంచిదైనను సిద్ధింపదు. అధర్మమున, మోసము, కపటముచే సంపాదించిన ధనము ఎన్నటికిని కల్యాణకరము కాజాలదు. ఈ పాపపు సంపాదన

సంపాదించు వ్యక్తిని, అతని కుటుంబమును, అతని శ్రేయోభిలాషులను, మిత్రులను పతనమునకు గురిచేయును (పాతయతి తస్మాత్)

దొంగ దొంగిలించును. బందిపోటు దోపిడి చేయును, హంతకుడు హత్యలు చేయును. కాన్ని చెడుమార్గమున ధనము నార్జించినవాడు ఏకముగా దొంగ, బందిపోటు, హంతకుల కోవలో చేరును. అంతేగాదు అధర్మమున సంపాదించువాడు, దొంగవ్యాపారము చేయువాడు, కపటము, మోసముతో సంపాదించువాడు దొంగ, బందిపోటు, హంతకులకు పెద్దన్న యగుచున్నాడు నాదిర్ షా బందిపోటు వలె వ్యవహరించెను, తైమూరు దోచుకొనెను, చంగీజ్ ఖాను, గజనీ, గోరీ మున్నగువారు హత్యలు, దోపిడీలు, కొల్లగొట్టుట మున్నగు చెడు కార్యములు చేసిరి. నేటివరకును జనులు వీరిని నిందించుచు నేయున్నారు ద్వేషించుచునే యున్నారు వీరు ఇతరుల జీవితములను జీవితములుగా భావించలేదు. వాటిని లెక్క చేయలేదు బంగారము, వెండి, మణులు, రత్న రాశులను పశువులపై మోపి వెంట గొని పోయిరి అతులమైన ధన సంపత్తిని సమకూర్చుకొనిరి. కాని అందుకు అధర్మమార్గము నవలంబించిరి. మరణ సమయమున జీవితములో చేసిన కర్మల లెక్క ఎదుటికి వచ్చెను. ఎంతటి ఘోరమైన అత్యాచారములు, ధోపిడీ దమన కాండలు జరిగిన అధనము లభించెనో అప్పుడు స్మరణకు వచ్చెను. అందులోనుండి ఒక్క గవ్వనైనను తమవెంట గొనిపోలేకున్నారు. కాని వాసనల, సంస్కారముల, ప్రవృత్తుల రూపమున నున్న కర్మల మూటను మాత్రము విడువలేకున్నారు. ఈశ్వరుడు మానవదేహము నిచ్చెను. కాని అధర్మపరులైనయీ దోపిడిగాడు పులి సింహము, తోడేలు, గ్రద్ద, కుక్కల వంటి వాసనలను సంచయ మొనర్చు కొనుటలోనే లీనమైయుండిరి. మానవదేహము పొందిరి. కాని తమ నీచకర్మ వలన తోడేలు, గ్రద్దల యోనులలోనికి పోవుటకు ఏర్పాటు చేసికొనిరి ఈ

ధనము ఈ ఐశ్వర్యము, ఈ సంపద కొరకు చేసిన బేరమున ఎంతటి వెల చెల్లించ వలసి వచ్చినది! ఎంత ఘోరనష్టము వాటిల్లినది!

ఈ ధనలోభము వల్ల అధికమూల్యము చెల్లించ వలసి వచ్చినది, నష్టమునకు గురియైనది కేవలము గజనీ, గోరీ, తైమూర్ మున్నగు వారేగాదు నేడు గూడ వీరి(వంటి) బంధువు లెందరోయున్నారు. ఇట్టివారు సత్యాచరణము ధర్మము యొక్క గొంతునులిమి ధనము సంపాదించుటకు క్రొత్త క్రొత్త పద్ధతులను అవలంబించు చున్నారు.

ఒక బీదరైతు ఇంటిలో పాలు, నేయ్యి ఉండును. కాని అతనికి కట్టుకొను బట్టలు రోగముతో బాధపడే సంతానమునకు మందులు కావలెను. ఆతడు బట్టలకై మాన రక్షణకై అప్పులు తీర్చుటకై, వడ్డీచెల్లించుటకై పాలు నేయి ఒక చుక్కనైనను మిగుల్చుకొనక అమ్మివేయును. అతడు పాలు, నేయి, బియ్యము మున్నగు సర్వోత్తమమైన పదార్థములు ఉత్పత్తి చేయును కాని వానిని అనుభవించువారు,మాత్రము ఈ అసహాయక బీదరైతే బట్టలు కొనబోవ మూడు రూపాయల బట్ట అతనికి ఐదు రూపాయల కివ్వబడును. ఈధూర్తత, అభాసమైన యీదోపిడి సరళస్వభావముగల అమాయక రైతు ముందే సాగును. కొనేవాడు తెలివిగలవాడు, అమ్మేవానికన్న నాలుగాకు లెక్కువే చదివినవాడు ఐనచో అతనినెవరె మోసగించ గలరు? అమాయకులు మాత్రమే మోసగింపబడు చున్నారు. ఇట్లు మూడింటికి పదమూడు తీసికొను వాడు వ్యాపారికాడు, దేపిడి చేయువాడే.

అధర్మపరులై మందులమ్మువారుగూడ ఇట్టివారే. ఎంతో కష్టపడి బీదవాడు ధనము నిలువచేసికొనును. కాని మందులు కొనివాడగా లాభమేమియు కలుగదు. ఈ మందులలోని కాలుష్యము మరణించు రోగుల యెడ ద్రోహము, జీవితములతో చెలగాటము గాక మరేమి? ఇట్టి మందుల వలన

ఎందరో బాలలు అనాథలు ఐనారు. ఎందరి యింటి దీపములు ఆరిపోయినవి. వృద్ధులెందరో ఆశ్రయములేని వారైనారు. ఇట్లెవరైనను ధనవంతులు కావచ్చును కాని యీ అనాథల, ఈ వృద్ధుల రక్త కన్నీరు ఆధనముతో కులుకు వారికి అభిశాపమే కాగలదు. సింహము తోడేళ్ల వంటి యీ ప్రవృత్తి మానవుని మానవత్వమునుండి పతన మొనర్చి అతనిని సింహము, తోడేలుగా, చేయ సమర్థమైనది.

మానవ శరీరము ధర్మమును సంపాదించుటకై లభించినది. కాని ప్రాపంచిక మెఱుగులు మనుష్యుని కన్నుల గప్పివేసినవి అతడు భోగలాలసకు నయనాభిరామమైన ఆకర్షణలకు లోనైనవాడు తనయింటి విద్యుత్కాంతి అందచందముల వెనుక ఎవరి హత్యయైన జరుగుట లేదు గదా యని ఆలోచించుటకు అతనికి సమయ మెక్కడిది?

విద్యుత్తు మెఱుపులోన దీపకళిక రోదనము
భవనము నిర్మాణములకై పూరిగుడిసె యొక్క బలి
కష్టపడే కర్షక హృదయము స్రవింప రుధిర ధార
వానిపైననే వైభవమను గోడల నిర్మాణము

ఈ రాక్షస సంస్కృతి, పైశాచిక ప్రవృత్తి ధర్మభీరువులమైన మన జీవితములందు గూడు కట్టు కొన్నది. "వణిక్పథం కుసీదం చ వైశ్యస్య కృషి మేవచ" అనెడి మనుస్మృతి శ్లోక భాగమునకు స్వామీ దయానందుల సంస్కారవిధిలో చేసిన వ్యాఖ్యను పరిశీలించుడు.

"(వణిక్పథమ్) వివిధ దేశముల భాష, గణితము, భూగర్భ విద్య, వర్తనములు మున్నగువాని గుణములను తెలిసికొనుట, (కుసీదం) వడ్డీ తీసికొనుట (రూపాయిపావలాకన్న ఎక్కువ, నాల్గణాలకన్న తక్కువ వడ్డీ తీసికోగూడదు, ఇవ్వగూడదు మూలమునకు రెండింతలు ధనము కాగానే

అంతకు మించి ఒక గవ్వయైనను తీసికోగూడదు. ఇవ్వగూడదు. ఎంత తక్కువ వడ్డీ తీసికొన్న అంతయే అతనిధనము పెంపొందును, అట్టివాని ధర్మము ఎన్నటికిని నశింపదు. అతని వంశమున చెడు సంతానము జన్మింపదు (కృషిమేవచ) వ్యవసాయ విద్యను తెలిసికొనుట. ఆహారాది పదార్థములు రక్షణ. ఎరువు మరియు భూమి పరీక్ష, దున్నుట విత్తుట మున్నగు వ్యవహారములను, తెలిసికొనుట."

ఇవియే వైశ్యవృత్తికి విహిత కర్మలు వీనితో పశూనాం రక్షణమ్" అనునది చేరియున్నది. ఇందు అధర్మము, శోషణము, అన్యాయాదులకు స్థానమేది? నేటివైశ్యవర్గమున నేమి జరుగు చున్నది? సంపాదన మరియు కూడ బెట్టు సంప్రదాయమునకు మూలము ఐరోపాలోని భోగవాదపు నాస్తిక సంప్రదాయమే. శ్రీ దేవేంద్రనాథ ముఖోపాధ్యాయ లెంతటి సత్యమును ప్రకటించిరో గమనింపుడు-

"ఐరోపా ఖండమా! "యోగ్యతమునికే విజయము" అనుపేర నీవు బలహీనుని నోటి గ్రాసమును ఇట్లే లాగికొనుచున్నావు. వందలాది మనుష్యులను ఆహారమునుండి వంచితుల జేయు చున్నావు. క్రమ క్రమముగ జాతినంతటిని నిగ్రహించి, పీడించి నిస్సహాయ స్థితికి దెచ్చు చున్నావు. విద్యుత్తు చే ప్రకాశించు నీగదియందు పాలరాతితో మెలుగొందు బల్ల చుట్టు అర్ధనగ్న సుందరీమణుల గూర్చుండ జేసి వారితో విందారగించుచు సంభాషించునపుడు అనుభవించు నీ సుఖము కొరకు పదిలక్షల మనుష్యుల తలలు కోయవలసి వచ్చినచో సునాయాసముగ నీవు వారితలలు నరుక గలవు. ఏలన యోగ్యతమునికే విజయము చేకూరుననియే నీవు చదివితివి! ఓ ఐరోపా ఆసురీ, అనార్ష శిక్షణ నీ రోమ రోమమున నిండియున్నది. తీరని నీధన లాలసను తీర్చుకొనుటకై ఒక మనుష్యునే కాదు కుటుంబము, సమాజమునే, కాదు మహోన్నత జాతినైనను నీవు ధ్వంసము చేయగలవు.

నేటి భారతీయుడు దేశపు ప్రకృతిని ప్రవృత్తియొక్క ఆచారమును, ఆచారపు కొలబద్ద భారతీయ సంప్రదాయము- అన్నింటిని వదలి పాశ్చాత్య నాస్తిక భోగవాద సంప్రదాయము ననుసరించుచున్నాడు. తత్ఫలితముగ ఆహారపద్ధతి. ఆచార వ్యవహారములు, ఆదాన ప్రదానము, కృషి, వాణిజ్యము అన్నియు పైశాచిక ఆసురీ అధర్మముల ననుసరించియే జరుగుచున్నవి. ఆచారపతనము, మాంస భక్షణ, సురాపానము, వ్యభిచారముల ప్రచారము. ఇతరుల పీడించు తీవ్రలాలస, బంధుభావము లేకుండుట, సానుభూతి మరియు సమాజ సేవాభావము నశించుట అన్నియు అత్యంత స్వార్థపరాయణము ధనలాలసతో కూడిన ఆర్థిక వ్యవస్థ యొక్క పరిణామమే.

ఆత్మహంతా: అసుర యోని

అర్థశౌచమును పాటింపక అధర్మమార్గమున ధనము సంపాదించుట కూడబెట్టుట ఆత్మహత్యతో సమానమే యగును. ఇది అసురయోనిని పొందుటకు చేయు ప్రయత్నమేయగును.

"అసుర్యా నామ తే లోకాః అంధేన తమసావృతాః।
తాంస్తే ప్రేత్యాపి గచ్ఛంతి యే కే చాత్మహనో జనాః ॥యజు ౪౦-౩,

ఆత్మహంతకులు చనిపోయి అసుర యోనులను పొందుదురు. ఈ అసుర యోనులు గాఢాంధకారముతో కూడియుండును.

ఈ ఆత్మహంతకు లెవరు?

ఆత్మ అజరము అమరమునైనది దాని హత్య ఎట్లు జరుగును?

ఆత్మ హత్యయన తన హత్య తన హత్య మన శరీర హత్యయనియే సామాన్యముగ భావింపబడుచున్నది. ఉరివేసికొనియో, విషము త్రాగియో

బావి, చెఱువు, నదిలో పడియో మరణించిన వారిని ఆత్మహంతకు లందురు వారికొరకే ఆసురీ యోనులు గలవు.

తమ నడవడిని, చరిత్రను హతమార్చు వారు, తమ వృత్తులను సంస్కారములను హతమార్చువారు ఈ శరీరహంతకుల కన్న భిన్నమైన ఆత్మహంతకులు వీరు అత్యంత అంధకారపూర్ణమైన పశువు మున్నగు యోనులను పొందుదురు.

అధర్మముగ ధనము సంపాదించువారిలో మంచి భావములు నశించును అధర్మజీవనము అశాంతి, దుఃఖము, క్లేశములతో కూడియుండును. ఇతరులను మోసగించి సంపాదించువాడు మానవత్వపు ఉదార భావములను కోల్పోవును. ఎవని కర్మలు నీచములో అతని వాసనలు, సంస్కారములు, వృత్తులు అన్నియు నీచములేయగును. ఇట్టి నీచములైన వాసనలు, సంస్కారములు, వృత్తులతో కూడిన సూక్ష్మ శరీరము ఈ దోషములన్నిటితో యుక్తమైపోవును. అధిక కామముగల వానికి కాముక యోనియు, అధికలోభము గలవానికి లోభ యోనియు అట్లే మోహము కపటము మున్నగు సంస్కారములు ప్రబలముగా గలవారికి వారికి అనుగుణమైన యోనులు లభించును. వేద మేమి చెప్పుచున్నదో గమనించుడు-

ఉలూకయాతుం శుశులూకయాతుం జహి శ్వయాతుముత కోక యాతుం
సుపర్ణయాతుముత గృధ్రయాతుం దృషదేవ ప్రమృణ రక్ష ఇంద్ర॥

అథర్వ ౮-౪-౨౨

అర్థము- ఓయింద్రా! గుడ్లగూబ, తోడేలు, కుక్క, కోకపక్షి, గరుడ పక్షి, గ్రద్ద వీని నడకలను వదలి వేయుము వీనిని గట్టిరాళ్ల చే నలిపి వేయుము.

గుడ్లగూబ చీకటిని ప్రేమించును, వెలుగుకు దూరముగ నుండును. అధర్మపరుడు గూడ తన స్వరూపమును తెలుసికొనుటకు, ఆలోచించుటకు

వెనుకాడును, తప్పుకొనును. తోడేలు, క్రూర స్వభావము, ద్వేషగుణము గలది. చెడుమార్గమున ధనము సంపాదించువాడు అతి క్రూరుడు, ద్వేష గుణముగలవాడగును. కుక్కలు స్వజాతి ద్రోహులు, ఇతరులను సంతోష పెట్టునవి (చాటుకారులు) నైయుండును. అసత్యము నాశ్రయించి ధనసంపా దన చేయువాడు గూడ జాతిద్రోహియు, రెండుకాసుల కొరకు ఇతరులను పొగడువాడు (భట్రాజు) అగుచున్నాడు. కోకపక్షి అతికాము కత్వము కలిగి యుండును. గరుడ పక్షికి తన రూపముపై అభిమానము మెండు గ్రద్ద లోభగుణము గలది. ధనమునకై ధర్మమును, శీలమును లెక్కచేయనివాడు తనలో ఒకే సమయమున గుడ్లగూబ, తోడేలు, కుక్క మున్నగువాని సం స్కారములను జాగృత మొనర్చి మానవత్వమును చంపుకొనును. రసశీలము ను హతమార్చువాడు, తన ధర్మమును, ఆచారమును హతమార్చువాడు శరీర హంతకుని కన్నగొప్ప ఆత్మహత యగుచున్నాడు. ఇట్టివారికి తగినయోనులు అత్యంత ప్రగాఢ అంధకార పూరితములైనవే. అధర్మమున సంపాదించిన ధనము నష్టపు బేరమే యగును. ఇది మానవుని పతనమొనర్చును. అతడు తన సంతానహితమునుగూడ చూడజాలడు.

సంతానమునకు శత్రువులు గాకుడు

మాతా శత్రుః పితావైరీ యేనబాలో న పాఠితః అనునది నీతి వాక్యము.

సంతానమును చదివింపని, వారికిమంచి శిక్షణ నొసగని తల్లిదండ్రులు తమ సంతానమునకు శత్రువులు. ఈవిషయమున స్వామీ దయానందులు తమ అమరగ్రంథమైన సత్యార్థ ప్రకాశమున నేమివ్రాసిరో గమనింపుడు:

తమ సంతానము విద్య, ధర్మము, సభ్యత మరియు ఉత్తమమైన శిక్షణ పొందునట్లు తను మనోధనములతో ప్రయత్నించుటయె మాతాపితరులకు కర్తవ్య, పరమ ధర్మము మరియు కీర్తిదాయకమగు కర్మ. "మనధనముతో

మనము మన సంతానమునకు "విద్య, ధర్మము, ఉత్తమ శిక్షణ" నొసగు ఏర్పాటు చేయలేకున్న అధనము నిరర్థకమే.

అధర్మముగ సంపాదించిన ధనము కుటుంబపతనమునకు కారణమగును మనుష్యుడు తన గౌరవము, సమ్మానము కొరకు ధనము సంపాదించ దలచును. కాని అక్రమధనము జీవితమున కర్మశీలము, సదాచారము, తపము సచ్ఛీలము మున్నగు సద్గుణములను నశింపజేయును. జీవితమున భోగలాలస సోమరితనము ప్రవేశించును. ధర్మము, సత్సంగము, స్వాధ్యాయము పట్ల మనసు విముఖ మగును. పూటకూళ్లు (హోటళ్లు), సారాయి, దురాచారము, వేశ్యాదులు జీవితమున తేలికగా ప్రవేశించును.

ఒకటేమిటి! ఇట్టి ఉదాహరణలు అనేకము గలవు. ధనము తక్కువగా నున్నపుడు కుంటుంబమున సదాచారము, శిష్టాచారము, తపము విద్య మున్నగు వానికి స్థానముండును. ధర్మాచరణకే ప్రాముఖ్యముండును. కాని ధనము పెరుగు చున్నకొలది, సంపాదన మర్యాద నతిక్రమించిన కొలది కుటుంబమున కలహములు, వైరభావము, సదాచారహీనత, కురీతులు పెరుగ సాగును. పిల్లలు సోమరులై పోవుదురు. తల్లిదండ్రుల సంపాదనపై జీవించు వారు పరిశ్రమ చేయవెరచి భోగలాలసు లగుదురు.

మనపూర్వజుల కాలమున ధన మధికముగ లేకుండెను. కాని కష్టపడి పనిచేయుగుణము, సదాచారము పుష్కళముగ నుండెను. సంధ్య, పూజ, సత్సంగము, స్వాధ్యాయము, ధర్మప్రచారము, పరోపకారము మున్నగు సత్కర్మలందు అభిరుచి యుండెను ధనము పెరిగి సంపాదనకు అంతు, అదుపు లేకుండా పోయినపుడు క్రమ క్రమముగ సంధ్య, పూజ, సత్సంగము స్వాధ్యాయము వారినివదలినది. వారి మనసులో పరోపకారమునకు స్థానము

లేకుండ పోయినది హోటళ్లు, క్లబ్బులు, సోమరి తనము, వ్యభిచారము మరియు సురాసుందరుల రాజ్యము విస్తరించినది. ఋషి దయానందులు సత్యార్థ ప్రకాశమున ఎంత స్వాభావిక వర్ణన చేసిరో గమనింపుడు —

"అధికధనము అసంఖ్య ప్రయోజనములకు మించి ప్రోగైనపుడు సోమరితనము, పురుషార్థరాహిత్యము, ఈర్ష్యా ద్వేషములు, విషయా సక్తి మరియు ప్రమాదము వృద్ధియగుట ప్రపంచమున గన్పట్టు స్వాభావిక ప్రవృత్తి దీనివలన దేశమున విద్య, సుశిక్షణ నశించి దుర్గుణ దుర్వ్యసన ములువృద్ధి యగును. మద్యమాంసాదుల సేవనము, బాల్యవివాహములు, స్వేచ్ఛా చారము మున్నగు దోషములు పెంపొందును.

అదుపులేని అడ్డగోలు సంపాదనచే ధర్మాధర్మముల నాలోచింపక ధనమునే పూజించువారు తమ సంతానమునకు, వంశమునకు శత్రువులగు చున్నారు. కుటుంబములలో వంశములలో విద్య, తపము, సదాచారము, ధర్మపరాయణతచే ధనము పోగైనచో చాలమంచిదే. "వయం స్యామ పతయో రయీణామ్ "అని ప్రార్థింపబడుచునే యున్నది. కాని ధనము వచ్చినందున వంశము. కుటుంబము, సంతానము నుండే విద్య, తపము, సదాచారము, ధర్మపరాయణము లోపించి భోగలాలస, ప్రమాదాలస్యములు, సురాసుందరులు, పైశాచిక వృత్తులు ప్రవేశించినచో అట్టి ధనమును రానీ యగూడదు. ధనము తప్పక రావలెను. కాని ధర్మాను సారమే రావలెను. నేటి ఉద్యమశీల జగత్తు, దాని ఉద్యమ నీతి ధర్మహీనమై నిర్ధనుల శోషణ మొనర్చుచున్నది. ధర్మద్వేషులైన కమ్యూనిస్టు నామ ధారులు. ధర్మమునకు శత్రువులు, ధర్మధ్వజులునైన శ్రేష్ఠుల (సేటుల) వ్యవహారముల జూచి ధర్మమునే నిందింపసాగినారు. అట్టి అధర్మ కారణముననే ధర్మమునకు గౌరవము తగ్గినది. ఇంకను తగ్గుచున్నది. తమ ఇంటి పెద్దల కొంగభక్తిని

జూచి, ఋషివృత్తిపూర్ణ ధార్మికతను గాంచి సంపన్న పరివారములందరి తెలివిగల విద్యార్థులు సామ్యవాదపు తర్కాభాసపు మెఱుగులచే ప్రభావితులై ధర్మవృత్తినుండి వైదొలగి భోగవాదపు ఆకర్షణల వైపు మొగ్గుచున్నారు. సొరకాయలు- చేపలు, గుడ్లు- బంగాళా దుంపలు అన్నియు నొక్కటియని భావించుచున్నారు. తరతరాలనుండి మాంసము, సారాయిని ఏవగించుచు వచ్చుచున్న వంశములోని యువకులు నేడు తమ అభిభావకుల అసత్యధార్మికతను చూచి విసుగుజెంది చరిత్రహీనులు, నాస్తికులు. భోగవాదులు, కమ్యూనిస్టులు అగుచున్నారు.

మహర్షి దయానందులు సంస్కారవిధిలో గృహాశ్రమ ప్రకరణమున దిగువ పేర్కొనిన మనుస్మృతి శ్లోకమును ప్రమాణముగ నొసగి ఒక ప్రేరక ప్రసంగమును వ్రాసినారు.

యది నాత్మని పుత్రేషు న చేత్పుత్రేషు నప్తృషు।
న త్వేవంతు కృతోऽధర్మః కర్తుర్భవతి నిష్ఫలః॥ మను-౪|౧౭౩॥

"అధర్మమునకు ఫలము కర్త జీవించియుండగనే లభింపకున్న అతని పుత్రుల సమయమునగాని, పుత్రులసమయమున లభింపకున్న మనుమల సమయమునగాని తప్పక లభించును. అంతేగాని కర్త యొనర్చిన కర్మ ఎన్నటికిని నిష్ఫలము కాజాలదు.

దీనినుండి కొందరు కృతహాని, మరియు 'అకృతాభ్యాగమ' దోషమును చూడ యత్నింప వచ్చును. కాని వాస్తవ మిదియే. అధర్మమునకు ఫలము మన సంస్కారము ద్వారా మన సంతానమున ప్రవేశించును. పైతృక రోగముల వలెనే పైతృక సంస్కారము నుండును. ఆర్థిక అపవిత్రత పైతృక రోగము. దీనిని మనము వదలించుకోలేక పోయిన ఈ రోగము

మన సంతానమునకు తప్పక సంక్రమించును. పిల్లలు తమ యోగ్యత.

పరిస్థితి, వాతావరణము ననుసరించి ఈ పాపములనుండి తమను రక్షించుకొన గల్గుదురు. లేదా వానియందే మునిగి వానికి దాసులై ఆ పాప కర్మలందే సుఖమున్నదని భ్రమింతురు.

పైశాచిక జీవన మానదండ చక్రము

నేటి యుగమున జీవన మానదండము పైశాచికమై పోయినది. అర్థనీతియు పైశాచికమైపోయినది. జీవనస్థాయిపేర మనవ్యయమును పెంచుకొనుచునే యున్నాము. అధునిక ఉపకరణములను, శృంగార సాధనములను పొందుటకై నేటి విలాసమయ జీవితావసరములకై అత్యధిక ధనము అవసర మగుచున్నది. ధర్మ సంపాదన వలన అంత ధనము లభించుట లేదు. సమాజమున మన స్థాయిని గౌరవమును నిలుపు కొనుటకై అధర్మ వ్యవహారము చేయవలసి వచ్చు చున్నది. మొదట ఇష్టము లేకున్నను వ్యక్తి అన్యమనస్కుడై ఇట్టి వ్యవహారమునకు, పూనుకొనును కాని క్రమముగా దానికి అలవాటు పడిపోవును. సమాజము గౌరవమును పొందును జనులు అతని అధర్మ సంపాదన విషయము పట్టించుకొనుట మానెదరు. అతడు అక్రమ సంపాదన కెన్నియో మార్గముల ననుసరించును నీతి నియమము, శీలము ధర్మము అన్నింటిని వదలివేయును నేయిలో క్రొవ్వును మందులలో సారాయిని ఆహారధాన్యములలో రాళ్లను, సిమెంటులో బూడిదను కలిపి అమ్ముటనే వ్యాపారమనును. ఈ యక్రమవ్యాపారమునకు తోడుగ ఉన్నతాధికారికి గొప్ప పేరుగాంచిన హోటలులో భవ్యమైన విందు ఏర్పాటు చేయును. మాంసము మదిర, సుందరి మున్నగునవే మేమియో ఎన్నెన్ని విధములలో సమకూర్చును. రావణుని పేరోలగము దీని ముందెంతటిది? ఈ జీవితము ముందు రాక్షస జీవితము ఎందుకును కొరగాదు.

ధనము అతిగా సమకూడ అతడు హోటళ్లయందు విహరింప సాగును.

అతనికి హోటలే స్థావరమగుటతో ఇంటి మహిళలు క్లబ్బు వారును, పిల్లలు సేవకులు మరియు దాదుల వారు అగుచున్నారు. శ్రీవారును శ్రీమతియు ఎందుల పొందుచున్నారు. సురాసుందరి సురాసుందరునిపొందుచున్నది. పతివ్రతము పత్నీవ్రతము సర్వనాశము పొందుచున్నవి, ధన పిశాచము వ్యక్తిని, అతని పిల్లలను, కుటుంబమును, సమాజమును, ధర్మమును అన్నింటిని సర్వనాశన మొనర్చు చున్నది.

ధర్మమార్గమున ధనమార్జింపుడు

ధనము సంపాదించుడు. కావలసినంత సంపాదించుడు. కాని ధర్మ మార్గమునకనే సంపాదించుడు అధర్మముగ సంపాదించిన ధనము ధర్మమును హతమార్చును. ధర్మఏవ హతో హంతి-' హతోధర్మః హంత్యేవ. హత ధర్మ ము నిశ్చితముగ హతమార్చును. కావున అధర్మమునకు దూరముగ నుండుడు.

పరిత్యజేదర్థ కామౌ యౌ స్యాతాం ధర్మవర్జితౌ।
ధర్మచాప్యసుఖోదర్కం లోక నిక్రుష్టమేవ చ॥మను. ౪।౧౭౬ ॥

దీనికి మహర్షి దయానందులు సంస్కారవిధి గృహాశ్రమ ప్రకరణ మున వ్రాసిన యర్థమిది—

"అధిక ధనము, రాజ్యము స్వీయకోరికలు అధర్మముచే సిద్ధించు చున్నను అధర్మమును సర్వథా వదలివేయవలెను. వేదవిరుద్ధమైన ధర్మా భాసము ననుసరించుటవలన భవిష్యత్తులో దుఃఖము మరియు ఉన్నతీనా శనము సంభవించును.అట్టి నామ మాత్రపు ధర్మమును. కర్మలను. ఎన్నటి కిని ఆచరించగూడదు"

ఇది ధనప్రధానమైన యుగము సమస్త. ధన మనెడు కొలబద్ద తోనే కొలువబడుచున్నది. ధనార్జన పద్ధతి మరియు ధనార్జన నీతి భారతీయ

సంస్కృతీమర్యాదల నతిక్రమించినవి. ఫలితముగ అధార్మిక, అధార్మిక రీతినీతులు, జీవనవిధానము, ఆహారపానీయములు, ఆచారవిచారములు మనజీవితములలో, ఇళ్లలో కుటుంబములలో, సమాజములో అత్యంత వేగమున ప్రవేశించుచున్నవి.

సర్వనాశము మన యెదుట నిలిచియున్నది. జనులు అటువైపే సాగిపోవుచున్నారు. కావున హెచ్చరిక అవసరమైనది.

కన్నులెంత చూచునో కాళ్లంత నడువజాలవు. మెదడు ఎంత ఆలోచించునో చేతులంత చేయజాలవు. ఏర్పరచిన ప్రణాళిక అంతయు పూర్ణము కాదు పూర్ణమైన ఆదర్శమును పాటించుటయు కష్టమే. ఐనను, కళ్ళుమెదడు ప్రణాళిక, ఆదర్శము వీటన్నింటికిని అత్యంత మహత్త్వము గలదు. ఆదర్శమును గూర్చి అధికాధికముగ మననము చేయుచుండవలెను, ఆచరించుటకు ఎల్లప్పుడు ప్రయత్నశీలురమై యుండవలెను అట్లు చేయుటలోనే కల్యాణము గలదు.

ధర్మమును రక్షింపుడు

ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః ।
తస్మాద్ధర్మో నహంతవ్యో మా నో ధర్మో హతోఽవధీత్॥

ధర్మమును నాశమొనర్చు వ్యక్తిని ధర్మము నాశమొనర్చును. ధర్మమును రక్షించువానిని ధర్మము గూడ రక్షించును కావున చంపబడిన ధర్మము మనను చంపునను భయము చేత ధర్మహననము ధర్మత్యాగమును ఎన్నడును చేయగూడదు.

కృతజ్ఞతలు

ఈపుస్తకము ప్రచురణకు సహాయ సహకారములందించిన మహాను భావు లందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియచేయు చున్నాను. పరమేశ్వరుడు వారికి, వారి కుటుంబ సభ్యు లందరికి ఆయురారోగ్య ఐశ్వర్యములను ప్రసాదించి ధర్మబుద్ధిని ప్రేరేపించుగాక

ఇట్లు

ప్రేమ్‌రాజ్ "ప్రేమ్"

